## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అమరచింత: పట్టణంలోని 33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని నందిమల్ల, మస్తిపూర్, కిష్టంపల్లి, ప్రియదర్శిని నందిమళ్ల ఎక్స్‌రోడ్ గ్రామాల్లో సోమవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రాంచందర్ తెలిపారు. అమరచింత విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ స్తంభాల తీగలకు చెట్ల కొమ్మలు తాకుతుండటంతో అంతరాయం కలుగుతుందని వీటిని తొలగించే పనులను చేపడుతున్నామని వెల్లడించారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

### రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి

పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. పీహెచ్‌సీలో కొన్ని నెలలుగా రెగ్యూలర్ డాక్టర్ లేకపోవడంతో రోగులకు సరైన వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి రెగ్యూలర్ డాక్టర్‌ను నియమించి వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలని కోరారు.

### ముగిసిన గురుకుల బ్యాక్‌లాగ్ పరీక్ష

గోపాల్‌పేట: గురుకుల పాఠశాలల్లో 2024–25లో 7, 8, 9వ తరగతి చదివేందుకు మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలలో నిర్వహించిన పరీక్ష ఆదివారం ముగిసింది. పరీక్ష ఉదయం 11గంటల నుంచి 1గంట వరకు జరిగింది. 344 మంది విద్యార్థులకు గాను 322 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఆరోగ్యం తెలిపారు. ఆర్‌సీఓ విద్యులత పరీక్షలను పర్యవేక్షించారు.

### మాజీ ఎంపీ పూజలు



ఖిల్లాఘనపురం: మండలంలోని పర్వతాపురంలో కోటమైసమ్మ దేవత ఉత్సవాలకు ఆదివారం మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో బాలస్వామి, నాగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, లోకయ్య, మల్లేష్ గౌడు, గోవర్దన్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ పతిష్ఠ



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని అంకూర్‌లో కొత్తగా నిర్మించిన నర్సాయిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహం పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరై పూజలు చేశారు.

### సమాచార హక్కు చట్టాన్ని పరిరక్షించాలి

పెబ్బేరు రూరల్: సమాచార హక్కు చట్టాన్ని పరిరక్షించి, నిర్ణీత గడువులో సమాచారం దరఖాస్తుదారులకు అందజేయాలని సామాజిక కార్యకర్త సంతోష్‌కుమార్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, కార్యాలయాల్లో బోర్డులు తప్పని సరిగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొందరు అధికారులు అందుబాటులో ఉన్న సమాచారం ఇవ్వడానికి కాలయాపన చేస్తున్నారని తెలిపారు.

### తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



వీపనగండ్ల: మండలంలోని పుల్గర్‌చర్లలో తాగునీటి ఎద్దడిని నివారించాలని రెండు బోర్లను వేశారు. రెండు బోర్లలో నీళ్లు రావడంతో గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. బోర్ వేసేందుకు సహకరించిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

### రేషన్‌బియ్యం పట్టివేత

కేటీదొడ్డి: అక్రమంగా రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. గద్వాల వైపు నుంచి ఎరుకలి రాజేష్ వివిధ గ్రామాల నుంచి 10 కింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి రాయచూర్‌కు వాహనంలో తరలిస్తున్నాడు. పోలీసులకు సమాచారం రావడంతో మండలంలోని మల్లాపురంతండా శివారులో తనిఖీల్లో భాగంగా పట్టుకుని వాహనాన్ని స్టేషన్‌కు తరలించి రాజేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# బీటీ రోడ్డుకు నిధులు

- అప్పారెడ్డిపల్లి నుంచి నేలబండతండా వరకు..
- 3కి.మీ. బీటీరోడ్డుకు రూ.1.80 కోట్ల నిధులు
- పూర్తయిన టెండర్ ప్రక్రియ



అప్పారెడ్డిపల్లి నుంచి నేలబండతండాకు వెళ్లే మట్టి రోడ్డు

ఖిల్లాఘనపురం: ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం సక్రమంగా లేక అవస్థలు పడుతున్న అప్పారెడ్డిపల్లి, నేలబండతండా, దేవబండతండా ప్రజల కష్టాలు తీరనున్నాయి. అప్పారెడ్డిపల్లి నుంచి రెండు గిరిజన తండాలను కలుపుతూ ఖిల్లాఘనపురం మండల శివారు వరకు ఉన్న 3 కిలోమీటర్ల మట్టి రోడ్డును బీటీగా మార్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

**రెండు గ్రామాలు, రెండు తండాలకు మేలు..**

మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి నేలబండతండా మీదుగా మద్దిగట్ల శివారు వరకు మద్దిగట్ల రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో అప్పారెడ్డిపల్లి ప్రజలతో పాటుగా దేవబండతండా, నేలబండ తండాల ప్రజలకే కాకుండా భూత్పూర్ మండలం మద్దిగట్ల ప్రజలకు మేలు కలగనుంది. ఈ దారిలో ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా గుంతలుగా మారడంతో చిన్నపాటి వర్షం కురిసిన వాహనాలు వెళ్లలేని దుస్థితి. ఒక్కో సమయంలో బైకులు కూడా వెళ్లలేని పరిస్థితి పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మట్టి రోడ్డును కాస్త బీటీగా మార్చనుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**రూ.1.80 కోట్ల నిధులు**

ఈ రోడ్డు వేసేందుకు ప్రభుత్వం 7 నెలల క్రితం రూ.1.80 కోట్ల ట్రైబల్ వెల్ఫేర్ నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే టెండర్ పనులు పూర్తి అయ్యాయి. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు త్వరలోనే అగ్రిమెంట్ చేయించి పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

**రైతులకు ఉపయోగం**



అప్పారెడ్డిపల్లి నుంచి మద్దిగట్ల రోడ్డు డాంబర్ రోడ్డు వేయడం చాలా సంతోషం. దారి వెంట గుంతలు ఏర్పడటంతో పొలాల వద్దకు వెళ్లే సమయంలో తాము చాలా ఇబ్బందులు పడుతున్నాం. డాంబర్ రోడ్డు వేస్తే ఇబ్బందులు తీరుతాయి.

– బంగి నర్సింహ, అప్పారెడ్డిపల్లి

## వైభవంగా రాములోరి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కొత్తకోట రూరల్: పట్టణకేంద్రంలోని కోదండరామస్వామి ఆలయంలో త్రయోదశి సందర్భంగా ఆదివారం సీతారాముల కల్యాణాన్నివైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రీరామ నవమి నిర్వహించిన తర్వాత త్రయోదశిన కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కల్యాణానికి పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. మాజీ ఎమ్మెల్యే రావుల రవింద్రనాథ్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, రాష్ట్ర మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ బద్రినాథ్, మున్సిపాల్ చైర్‌పర్సన్ సుఖేశిని, నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని బూత్‌కూర్ మాజీ సర్పంచ్ నర్సింగమ్మ, ఉప సర్పంచ్ అంజలమ్మతో పాటు 30మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. పాత, కొత్త తేడా లేకుండా అందరు కలిసి కట్టుగా పనిచేసి పార్టీని సంస్థాగతంగా అభివృద్ధి చేయడంతో పాటు ఏ ఎన్నికలు జరిగినా పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. నాలుగు నెలల్లో పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలన్నారు.

## అధ్వానంగా డ్రెయినేజీలు



గాంధీచౌక్ నుంచి కొత్తకోట రోడ్డు పక్కన నిండిన డ్రైయినేజీ



గాంధీచౌక్ నుంచి పాత మున్సిపల్ రోడ్డు పక్కన..

ఆత్మకూర్: పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. భరించరాని కంపుతో స్థానికులు తిప్పలు పడుతున్నారు. స్థానిక గాంధీచౌక్ నుంచి పాతమున్సిపల్ రోడ్డు వైపు నాలుగేళ్లుగా డ్రెయినేజీ కోసం తవ్వి వదిలేయడంతో మురుగు చేరి రోడ్లపై వస్తుంది. అలాగే కొత్తకోట రోడ్డువైపు డ్రెయినేజీలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో మురుగు ముందుకు సాగక కంపు కొడుతుంది. మున్సిపాలిటీ పాలకవర్గం, కమిషనర్ త్వరతగతిన సమస్యలను పరిష్కరించి డ్రెయినేజీలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

## వట్టెం వెంకన్నను దర్శించుకున్న వనపర్తి ఎమ్మెల్యే



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు

బిజినేపల్లి: మండలంలోని వట్టెం వేంకటేశ్వరస్వామి వారిని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దంపతులు ఆదివారం ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చక బృందం వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గోత్రనామార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన నిర్వాహకులు శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు శ్రీప్రసాద్‌చార్యులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన



కోదండాపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ స్వాతి

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కోదండాపురంలో పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం సామాజిక అంశాలతో పాటు పోలీస్ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ స్వాతి ప్రజలకు ఆపదలో ఉపయోగపడే డయల్ 100, రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, పోక్సో కేసుల పర్యవసానాలు, సీసీ కెమెరాల ఉపయోగాలతో పాటు రైతులకు వివిధ ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించారు.ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి సమాచారం అందించాలన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడి తమ విలువైన భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. మైనర్ బాలికలను వేధిస్తే పోక్సో చట్టం ద్వారా చర్యలు ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు, తదితరులు ఉన్నారు.

## వ్యక్తిపై దాడి: కేసు నమోదు



గాయపడిన నర్సింహగౌడ్

పెబ్బేరు రూరల్: భూ తగాదాలతో పెబ్బేరు పట్టణ కేంద్రంలో ఓ వ్యక్తిపై ఆదివారం దాడి చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన గుంద్రాతి నర్సింహగౌడ్ ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి వనపర్తి రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా, మార్గమధ్యలో వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తులు కారులోంచి నలుగురు, బైక్‌పై ఇద్దరు వచ్చి దాడి చేశారు. స్థానికులు బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. నర్సింహగౌడ్‌కు దాయాదులకు భూత గాదాలు నడుస్తున్నాయని, అవి కోర్టు పరిధిలో ఉన్నట్లు తెలిపారు. ఈ దాడికి ఆస్తి తగాదలే కారణమని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### నేడు బీఆర్‌ఎస్ సమావేశం

ఆత్మకూర్: బీఆర్‌ఎస్ అమరచింత, ఆత్మకూర్ మండలాల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం సోమవారం స్థానిక సాయితిరుమల ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం 12గంటలకు నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎంపీ అభ్యర్థి మన్నెశ్రీనివాస్‌రెడ్డి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆలవెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, ఎస్‌ఆర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

ఖిల్లాఘనపురం: మండలంలోని పర్వతాపురం చెందిన కాంగ్రెస్ నాయకుడు దామోదర్‌రెడ్డి శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆదివారం వారి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబానికి పార్టీ తరుపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

### మైసమ్మ చెంత భక్తుల రద్దీ



నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ దేవాలయం చెంత ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో మైసమ్మ అడవి మొత్తం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. కాగా భక్తులు పచ్చని చెట్ల కింద విందులు ఏర్పాటు చేసుకుని ఉల్లాసంగా గడిపారు.

### నేటి నుంచి హనుమాన్ జయంత్యుత్సవాలు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక తొమ్మిదో వార్డు పరిధిలోని పాలకొండ లో అభయాంజనేయస్వామివారి జయంత్యుత్సవాలు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిరోజు రాత్రి ప్రభోత్సవం, 23వ తేదీ తెల్లవారుజామున 5.30 గంటలకు డోలోత్సవం ఉంటుందన్నారు. 24వ తేదీ తెల్లవారుజామున మూడు గంటలకు రథోత్సవం, అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు శకటోత్సవం ఉంటుందన్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## నేటి నుంచి శివరామాంజనేయ మహోత్సవం



ముస్తాబైన శివరామాంజనేయ ఆలయం

పాన్‌గల్: మండలంలోని అన్నారంలో సోమవారం నుంచి శివరామాంజనేయ ఆలయ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే మహోత్సవంలో ధ్వజస్తంభం, బొడ్రాయి, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపనలు, సీతారాముల వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## ఇరుకైన రహదారులతో ఇక్కట్లు



మస్తీపురం మీదుగా ఇరుకైన ప్రాజెక్టు రహదారి

అమరచింత: మస్తీపురం ఎక్స్‌రోడ్ నుంచి జూరాల ప్రాజెక్టు మీదుగా గద్వాలకు వెళ్తున్న ప్రధాన రహదారి మస్తీపురం మీదుగా వెళ్తుంది. గ్రామం మధ్యలో ఇరుకైన రహదారి కావడంతో భారీ వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితులు దాపరించాయి. నాలుగు రోజుల కిందట వడ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ ఇరుకైన రహదారిపై అదుపు తప్పి గ్రామానికి చెదిన ఐజీ రమేష్ రెడ్డి ఇంటి కాంపౌండ్ వాల్‌ను ఢీకొట్టింది. దీంతో ఎలాంటి ప్రాణ నష్టం కాకపోయిన తరుచూ ఇలాంటి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా ఆత్మకూర్ పట్టణంలో రహదారిపై డివైడర్‌లు నిర్మించడంతో ఇరుకై న రహదారి తయారైంది. ఇలాంటి రహదారిపై మొరం మట్టిని కప్పి ఉంచడంతో ప్రయాణికులు తమ వాహనాలకు అతి జాగ్రత్తగా నడపాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఇరుకై న రహదారులను గుర్తించి ప్రమాదాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## కాంగ్రెస్ నాయకుల ప్రచారం ప్రారంభం



కొత్తకోటలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని భవానీ మాత ఆలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా చల్లా వంశీచందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలంటూ పట్టణంలోని పలు వార్డులో ప్రచారం చేశారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓటు వేయాలని, దేశానికి రాహుల్ ప్రధానమంత్రి అయితేనే దేశంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటారని, గడిచిన 10ఏళ్ల బీజేపీ పాలనలో నిత్యవసర రేట్లు పెరగడంతో పాటు సామాన్యుడి బతుకలేని దుస్థితిని తీసుకొచ్చారని ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రశాంత్, బోయేజ్, పీజే.బాబు, మిషేక్, నరేందర్ రెడ్డి, సంద వెంకటేష్, నవీన్, ముస్తఫా, భాస్కర్, బాలరాజు తదితరులు ఉన్నారు.

## సభకు అధిక సంఖ్యలో తరలిరావాలి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

వనపర్తిటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నాగర్‌కర్నూల్‌లో మంగళవారం నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభకు ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారని, అదేవిధంగా కేంద్రంలో సైతం అధికారంలోకి రావడానికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో రాములు, వెంకట్‌నారాయణ, పెంటన్న, వెంకటేశ్వర్‌లు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



ఖిల్లాఘనపురంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖిల్లాఘనపురం: బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని నాయకులు ఆదివారం రాత్రి మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం చేశారు. పేదల బాధలు తెలిసిన వ్యక్తి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పార్లమెంటుకు పంపితే ఈ ప్రాంతంలోని సమస్యలను పరిష్కరించడంలో ముందుంటారన్నారు. ఉద్యోగాన్ని సైతం లెక్క చేయకుండా పేదలకు సేవచేయాలనే ఉద్దేశ్యంతో ఎంపీగా నిలబడ్డారన్నారు. ప్రజలంతా ఆశీర్వదించి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, సామ్యనాయక్, అశోక్, రాఘవేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, బుచ్చిబాబుగౌడు, సత్యనారాయణ, చిన్న ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గాలివానకు నేలకొరిగిన చెట్లు



నేలమీద పడ్డ చెట్టు, కరెంట్ స్తంభం



విరిగిన కరెంట్ స్తంభం

పెబ్బేరు రూరల్: మండలంలోని కొత్త సూగూరులో శనివారం రాత్రి కురిసిన వర్షం, గాలి వీచడంతో వ్యవసాయ పంట పొలాల వద్ద చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలమీద పడ్డాయి. కొన్ని స్తంభాలు విరిగిపోయాయి. దీంతో వ్యవసాయ పంపు సెట్లకు కరెంట్ నిలిచిపోయింది. అధికారులు స్పందించి స్తంభాలను సరిచేసి విద్యుత్‌ను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

## బీజేపీ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదివారం మండలంలోని రంగాపురంలో నాయకులు ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో భగవంతుయాదవ్, జలందర్ శివశంకర్, నాయకులు పాల్గొన్నారు.



## రిజర్వాయర్‌లో చేపల గూళ్లు

మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్‌లో చేపలు తమ సంతాన ఉత్పత్తి కోసం నివాసాలు ఉండేందుకు గూళ్లు తయారుచేసుకున్నాయి. గుంతల మాదిరిగా ఉండే ఈ గూళ్లలో గుడ్లను పెట్టి పిల్లలను పెంచుకుంటాయి. దూబొచ్చె రకం చేప ఈ రకమైన ఇళ్లను తయారు చేసుకుంటాయని మత్స్యకారులు తెలిపారు. జలాశయంలో భారీగా నీటిమట్టం తగ్గడంతో ఇలాంటి గూళ్లు అనేకం బయటపడుతున్నాయి.

– వీపనగండ్ల